క్లుప్తంగా

ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు



బాధితుల సమస్యలు వింటున్న సహాయ కమిషనర్ ప్రసాద్

చిత్తూరు అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ప్రజల నుంచి అందే వినతులపై నిర్లక్ష్యంగా ఉండొద్దని చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ సహాయ కమిషనర్ ప్రసాద్ ఆదేశించారు. సోమవారం ఆయన కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి అందే ప్రతి వినతి, ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో విచారించి త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఆర్థిక అంశాలతో ముడిపడిన వాటిని ప్రాధాన్యత ఆధారంగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ ప్రసాద్, ఏసీపీ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ సమస్యలను పరిష్కరించండి



బంగారుపాళెం: తహసీల్దార్‌కు వినతులు సమర్పిస్తున్న బాధితులు

బంగారుపాళెం: గ్రీవెన్స్ డేలో ప్రజలు ఇచ్చే ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్‌డేలో భాగంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. దారి, భూ సమస్య, పట్టా పుస్తకాలలో పేర్లు మార్పు, ఇళ్ల స్థలాలు మంజూరు, గ్రామాల్లో గ్రామకంఠం భూములు సర్వే చేయాలని పెద్ద సంఖ్యలో ప్రజలు అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. అధికారులు తమ పరిధిలో వచ్చిన సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.


విచ్చలవిడిగా బెల్ట్‌షాపులు

గుడిపాల: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మండలంలో పలు గ్రామాల్లో బెల్ట్‌షాపులు అధికమయ్యాయి. దీంతో గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోంది. ప్రతిరోజూ రాత్రి వేళ ఏదో ఒక గ్రామంలో తగాదాలు పెట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు చేరుతున్నారు. గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టుషాపులు వెలుస్తుండడంతోనే ఈ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. మండలంలో చిత్తపార, పిళ్లారికుప్పం, 197 రామాపురం, కమ్మతిమ్మాపల్లె, చిన్న ముస్తూరుకుప్పం, గొల్లమడుగు, రాయల్‌చేను తదితర ప్రాంతాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నారు. దీంతో పాటు చీలాపల్లె, మొగరాల్లపల్లె, రాసనపల్లె, చీలాపల్లె ప్రాంతాల్లో సారా విక్రయాలు అధికంగా జరుగుతున్నాయి. ఎక్సైజ్ అధికారులు, పోలీసులు మాత్రం చోద్యం చూస్తున్నారు. కొంతమంది గ్రామస్తులు పోలీసులకు ఫోన్ చేసి చెబుతున్నప్పటికీ కూటమి నాయకులు ఒత్తిడికి తలొగ్గుతున్నారు. చేసేది లేక మౌనం వహించడంతో గ్రామాల్లో తగాదాలు అధికమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి గ్రామాల్లో బెల్ట్‌షాపులు, సారా విక్రయాలను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

వర్క్‌షాప్

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం మురకంబట్టులోని అపోలో కాలేజీలో సోమవారం క్లినికల్ హిప్నోథెరపీపై జాతీయ వర్క్‌షాప్ ప్రారంభించారు. స్కూల్ ఆఫ్ హెల్త్ సైన్స్‌లోని సైకాలజీ విభాగం ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా.. అధ్యాపకులు సేతురామయ్య, వైద్యులు విజయ్ పాల్గొని మానసిక ఆరోగ్య విద్య అభివృద్ధిపై వివరించారు. హిప్నో చేసే విధి విధానాలపై ప్రయోగాత్మకంగా శిక్షణ ఇచ్చారు.

నేడు 'ఏకలవ్య కాలనీ..' ఆవిష్కరణ



ఏకలవ్య కాలనీ కథా సంపుటి

పలమనేరు: ప్రముఖ రచయిత పలమనేరు బాలాజి రచించిన 'ఏకలవ్య కాలనీ.. ఎరుకల జీవనగాథలు' పుస్తకావిష్కరణ మంగళవారం హైదరాబాద్‌లోని సాధి బుక్‌స్టాల్ వద్ద చేయనున్నట్టు పుస్తక రచయిత ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి కామన్‌వెల్త్ క్రీడల్లో గోల్డ్ మెడల్ సాధించిన రాగాల వెంకట రాహుల్, సాహితీవేత్త వేణుగోపాల్ దీన్ని ఆవిష్కరించి కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత శివారెడ్డికి తొలి సంపుటిని అందజేస్తారని తెలిపారు. ఇందులో ఎరుకల కులస్తుల జీవితాలను కళ్లకు కట్టినట్టు చిత్రించినట్లు పేర్కొన్నారు.

ముహూర్తం కుదరలేదా..! రావడం ఇష్టం లేదా?



ఎస్ఈ కార్యాలయం



జరుగుతున్న గదుల విభజన పనులు

- 2 నెలలవుతున్నా విధుల్లో చేరని విద్యుత్‌శాఖ ఉద్యోగులు
- చిత్తూరు ఎస్ఈ కార్యాలయానికి మొత్తం 55 మందిని కేటాయించిన సీఎండీ
- ప్రస్తుతం విధుల్లో చేరింది కేవలం 10 మంది మాత్రమే
- చిత్తూరులో ఎస్ఈ కార్యాలయానికి రావడానికి అనాసక్తి
- కార్యరూపం దాల్చని పాలనా వ్యవహారాలు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లా విద్యుత్‌శాఖ పరిపాలన గతంలో తిరుపతి కేంద్రంగా జరిగేది. పరిపాలన సౌలభ్యత కోసం రెండు నెలల ముందు చిత్తూరు జిల్లాకు ఎస్ఈ కార్యాలయం, అధికారులను కేటాయించారు. అయినప్పటికీ కొందరు అధికారులు మాత్రమే ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్నారు. జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయంలో పలు విభాగాల అధికారులను కేటాయించినప్పటికీ బాధ్యతలు స్వీకరించకుండా.. పాలనపై దృష్టి సారించలేదనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. జిల్లా కార్యాలయాన్ని పాత చిత్తూరు రూరల్ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. మొదట రూరల్ డివిజన్, ఎస్ఈ కార్యాలయం ఉద్యోగులు కలిసి విధులు నిర్వహించేవారు. తర్వాత నూతన రూరల్ డివిజన్ కార్యాలయం పాతకలెక్టరేట్‌లో ఏర్పాటు అయిన విషయం తెలిసిందే.

2 నెలలవుతున్నా చేరని ఉద్యోగులు

స్థానిక గిరింపేటలో ఎస్ఈ కార్యాలయం కేటాయించి రెండు నెలలవుతోంది. జిల్లా మొదటి ఎస్ఈగా ఇస్మాయిల్‌అహ్మద్ అక్టోబర్ 13న బాధ్యతలు స్వీకరించారు. ఆయనతో పాటు టెక్నికల్ ఈఈ, ఎస్ఏఓ, పీఓ, ఎంఆర్‌టీ, నిర్మాణవిభాగం, ఏఏఓ ఇతర అధికారులు తదనంతరం విధుల్లోకి చేరారు. ఇందులో నిర్మాణ విభాగం ఈఈ బాధ్యతలు స్వీకరించినా..ఇప్పటికీ తిరుపతిలోనే విధులు నిర్వహిస్తున్నారు. జిల్లాకు ఎస్ఈ 1, ఈఈ 3, డీఈ 6, ఏఈ 12, జేఈ 4, ఎస్ఏఓ 1, ఏఏఓ 1, జేఏఓ 5, పీఓ 1, ఎస్ఏ 11, జేఏ 9 మంది చొప్పున మొత్తం 55 మందిని కేటాయించినట్లు సీఎండీ ప్రకటించారు. ఇందులో 25 మంది తిరుపతి ఎస్ఈ కార్యాలయం, మిగిలిన ఉద్యోగులు అన్ని డివిజన్ల కార్యాలయం నుంచి సర్దుబాటు చేస్తామన్నారు. కానీ ఇప్పటి వరకు 10 మంది అధికారులు మాత్రమే బాధ్యతలు స్వీకరించారు. మిగిలిన వారు నేటికీ విధుల్లో చేరలేదు. జిల్లాకు బదిలీ అయిన 25 మంది ఉద్యోగులు, సిబ్బందిని ఉన్నతాధికారి రిలీవ్ చేయకపోవడంతో నూతన కార్యాలయంలో పాలనా వ్యవహారాలు కార్యరూపం దాల్చడం లేదు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడినందునే ఈ పరిస్థితి నెలకొందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

చిత్తూరుకు వచ్చేందుకు ఇష్టం లేక..

మొదటి నుంచి తిరుపతిలో పనిచేస్తున్న ఉద్యోగులకు చిత్తూరుకు రావాలంటే అనాసక్తి ఉన్నట్లు తోటి ఉద్యోగులు చెబుతున్నారు. చిత్తూరుకు రావడానికి ఏదో సాకులు చెబుతూ రెండునెలలు కాలం వెల్లదీశారు. తొలుత రూరల్, ఎస్ఈ కార్యాలయం రెండూ ఒకేచోట ఉండడంతో విధులు నిర్వహించడానికి స్థలం లేదన్నారు. తర్వాత తుపాను సమయమని రిలీవ్ చేయడం లేదన్నారు. చివరిగా రూరల్ కార్యాలయాన్ని పాత కలెక్టరేట్‌లో ఏర్పాటు చేయగా ఉద్యోగులు అక్కడికి మారారు. అయినా తిరుపతి నుంచి ఉద్యోగులు రావడం లేదు. నూతన కార్యాలయం పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాకపోవడంతో విద్యుత్ సేవలు, పలు అభివృద్ధి పనులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. శాఖాపరమైన వ్యవహారాలు, ఇతర అంశాల్లో పురోగతి నిలిచిపోయింది. ఉన్న ఉద్యోగుల వద్ద పూర్తిస్థాయి జిల్లా సమాచారం లేదు. జిల్లా ఉన్నతాధికారులు ఏదైనా సమాచారం అడిగితే నామమాత్రంగా ఇస్తున్నారే తప్ప పూర్తిస్థాయిలో ఇవ్వడం లేదు.

> **నెలాఖరులోగా వస్తారు**
>
> జిల్లా విద్యుత్ కార్యాలయం నుంచి నెలఖారులోగా పూర్తిస్థాయిలో సేవలందించేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం ఎస్ఈ కార్యాలయంలో గదుల విభజన పనులు జరుగుతున్నాయి. అది అయ్యాక టేబుల్స్, సిస్టమ్స్‌ను సిబ్బంది బిగించనున్నారు. మౌలిక వసతులు కల్పించాక ఉద్యోగులు రావాలని ఆదేశాలు ఇచ్చాం. వారం రోజుల్లో పనులు పూర్తవుతాయి. తదుపరి వారంలో అందరూ విధుల్లోకి చేరుతారు.
>
> –ఇస్మాయిల్‌అహ్మద్, ఎస్ఈ ట్రాన్స్‌కో

జాతీయ స్థాయి పోటీలకు బంగారుపాళెం విద్యార్థులు



పోటీలకు ఎంపికైన అంజలి, జాస్మిన్

బంగారుపాళెం: జాతీయ బాస్కెట్ బాల్ సబ్ జూనియర్ పోటీలకు బంగారుపాళెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పీడీ గిరిజ సోమవారం తెలిపారు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న అంజలి, జాస్మిన్ జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ జట్టులో స్థానం దక్కించుకున్నట్లు చెప్పారు. ఈ నెల 16 నుంచి 22 వరకు హైదరాబాద్‌లో నిర్వహించనున్న పోటీల్లో ఏపీ జట్టు తరపున ప్రాతినిధ్యం వహించనున్నారని తెలిపారు. సబ్ జూనియర్ బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులను ఉపాధ్యాయులు అభినందించారు.

హైరోడ్డు విస్తరణకే ప్రాధాన్యం

చిత్తూరు అర్బన్: చిత్తూరు హైరోడ్డును విస్తరిస్తేనే నగరాభివృద్ధి సాధ్యమవుతుందని పలువురు ప్రముఖులు అభిప్రాయపడ్డారు. సోమవారం స్థానిక నాగయ్య కళాక్షేత్రంలో చిత్తూరు అభివృద్ధిపై ప్రముఖులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. చిత్తూరు మేయర్ అముద, ఎమ్మెల్యే జగన్ మోహన్ నాయుడు, చుడా చైర్‌పర్సన్ హేమలతతో పాటు వైఎస్సార్‌సీపీ, బీజేపీ, కమ్యూనిస్టు పార్టీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రి రోడ్డును విస్తరించాల్సిన అవసరం ఉందని కమ్యూనిస్టు నేతలు కోరారు. వైఎస్సార్‌సీపీ తరఫున హాజరైన రావూరి ఈశ్వరరావు మాట్లాడుతూ చిత్తూరు అభివృద్ధికి రోడ్ల విస్తరణ తప్పనిసరి అని, కొంగారెడ్డిపల్లె రోడ్లను సైతం విస్తరించాల్సి అవసరం ఉందన్నారు. చిత్తూరు అభివృద్ధికి అందరూ కలిసి కట్టుగా ముందుకు రావాలని, రోడ్డు విస్తరణపై చట్ట ప్రకారమే ముందుకు వెళతామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

పల్లెల అభివృద్ధే మనందరి లక్ష్యం





మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ, గుడిపాల: మాట్లాడుతున్న ఎంపీడీఓ శివరాజన్

చిత్తూరు రూరల్ (కాణిపాకం): పల్లెల్లో అభివృద్ధి పరుగులు పెట్టాలని జెడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడు అన్నారు. చిత్తూరు ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి స్థానికీకరణ, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై సోమవారం వివిధ శాఖల అధికారులతో శిక్షణ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఐరాల మండలం బొమ్మసముద్రం గ్రామపంచాయతీని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆ రకంగా పంచాయతీలను అభివృద్ధి చేసుకునేందుకు పక్కా ప్రణాళికలు రచించాలని, గ్రామాల అభివృద్ధితోనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. గ్రామంలో మౌలిక వసతులు సౌకర్యవంతంగా ఉండాలని సూచించారు. గ్రామాల అభివృద్ధిలో బయట రాష్ట్రాలు, దేశాలకు వెళ్లిన వ్యక్తులను భాగస్వామ్యం చేయాలన్నారు. కార్యక్రమంలో డీపీఓ సుధాకర్‌రావు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధే ధ్యేయం

గుడిపాల: సుస్థిర అభివృద్ధే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఎంపీడీఓ శివరాజన్ తెలిపారు. సోమవారం గుడిపాల మండలంలోని నరహరిపేట జెడ్పీ హైస్కూల్‌లో సర్పంచులు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరిక లేని గ్రామంగా, ఆరోగ్యవంత గ్రామంగా తీర్చిదిద్దాలన్నదే ముఖ్య ఉద్దేశమన్నారు. అందరికీ సమన్యాయం, నీటి సమృద్ధి, గ్రామాల్లో ఇన్‌ఫ్రాస్టక్చర్, ఇతర అంశాలపై అవగాహన కల్పించారు.

పంచాయతీల అభివృద్ధిపై దృష్టి సారించాలి

తవణంపల్లె: గ్రామ పంచాయతీల అభివృద్ధిపై అధికారులు దృష్టి సారించాలని ఎంపీపీ ప్రతాప్ సుందర్‌రాయల్ రెడ్డి తెలిపారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కార్యక్రమం కింద ప్రభుత్వ అన్ని శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి నిర్వహించిన శిక్షణా తరగతులను డీఎల్‌పీఓ పార్వతి పర్యవేక్షించారు. పంచాయతీల్లో క్లీన్ అండ్ గ్రీన్ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రెడ్డిబాబు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీ సేవలు అభినందనీయం



పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన క్యాంపు

చిత్తూరు కలెక్టరేట్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నిర్వహిస్తున్న సేవలు అభినందనీయమని కేశవరెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి అన్నారు. సోమవారం నగరంలోని పలు పాఠశాలలు, కళాశాలల్లో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు రక్తవర్గీకరణ క్యాంపులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రక్తవర్గీకరణ క్యాంపులు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచే సేవాదృక్పథం ను అలవాటు చేసుకోవాలని చెప్పారు. అనంతరం పలు స్కూళ్లు, కళాశాలల్లో 1000 మంది విద్యార్థులకు రెడ్‌క్రాస్ సొసైటీ వైద్యులు రక్తవర్గీకరణ క్యాంపులు నిర్వహించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా కార్యదర్శి సహదేవనాయుడు, పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ అబ్దుల్ నజీర్, రెడ్‌క్రాస్ సంస్థ సభ్యులు శ్రీనివాస మూర్తి, ప్రసాద్, కళాశాల అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బంది కలగకూడదు



అయ్యప్ప మాలధారులతో మాట్లాడుతున్న ఈఓ

కాణిపాకం: భక్తులకు వసతులు, సౌకర్యం కల్పించడంలో ఇబ్బంది కలగకూడకుండా చూడాలని ఈఓ పెంచల కిషోర్ సిబ్బందిని ఆదేశించారు. కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయ పరిధిలోని డార్మెటరీ, బస్టాండు, కల్యాణ మండపం, వసతి గదులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అయ్యప్ప మాలధారులతో మాట్లాడి సమస్యలను ఆలకించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు.

టెన్త్ మోడల్ పేపర్ల ఆవిష్కరణ



మోడల్ పేపర్లను ఆవిష్కరిస్తున్న హెచ్ఎం, యూటీఎఫ్ సంఘ నాయకులు

ఐరాల: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థుల కోసం రూపొందించిన మోడల్ పేపర్లు ఎంతో ఉపయోగపడతాయని కాణిపాకం హైస్కూల్ హెచ్ఎం చంద్రశేఖర్‌నాయుడు తెలిపారు. సోమవారం కాణిపాకం జెడ్పీ హైస్కూల్ ఆవరణలో యూటీఎఫ్ రాష్ట్ర సంఘం తయారు చేసిన టెన్త్ మోడల్ పేపర్లను యూటీఎఫ్ సంఘ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ గత 24 ఏళ్లుగా ఏటా పదో తరగతి విద్యార్థుల ప్రయోజనాల కోసం యూటీఎఫ్ మోడల్ పేపర్లు తయారు చేసి పంపిణీ చేయడం అభినందనీయమని చెప్పారు. ఈ మోడల్ పేపర్లను యూటీఎఫ్ మండల మాజీ అధ్యక్షుడు సురేస్‌బాబు తన సొంత నిధులతో 108 మంది విద్యార్థులకు అందజేయడం హర్షణీయమన్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్‌నాయుడు మాట్లాడుతూ ఈ మోడల్ పేపర్ల నుంచి ఏటా 70 నుంచి 85 శాతం ప్రశ్నలు వస్తున్నాయని, గ్రామీణ విద్యార్థులకు, వెనుకబడిన విద్యార్థులకు ఇవి ఎంతగానో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సురేంద్రబాబు, శాంతాదేవి, మీనాకుమారి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు





మత్యం క్రాస్‌లో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ మోహన్‌వేలు, ఐరాల: బీరప్పచెరువు గ్రామంలో..

తవణంపల్లె: గర్భిణులు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. సోమవారం మండలంలోని మత్యం క్రాస్‌లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో 30 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు 104 మొబైల్ క్లినిక్‌లో పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగు పరుచుకోవాలని సూచించారు. దోమ కాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు. జ్వరాలు సోకిన వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ రాజామణి, హెల్త్ సూపర్‌వైజర్ రాజశేఖర్, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

ఐరాల: మారుతున్న వాతావరణ పరిస్థితుల కారణంగా అంటువ్యాధులు సోకే ప్రమాదం ఉందని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ కోరారు. సోమవారం మండంలోని బీరప్ప చెరువులో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహన సేవల్లో భాగంగా 55 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

చెరువు కాలువ ఆక్రమణపై ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న వేణుగోపాల్

ఐరాల: మండలంలోని వీఎస్ అగ్రహారం చెరువు కాలువ ఆక్రమణకు గురవుతోందని బాధితుడు ఎం.వేణుగోపాల్ సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్ మహేష్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం వేణుగోపాల్ మాట్లాడుతూ నాగంవాండ్లపల్లె పంచాయతీకి చెందిన వీఎస్ అగ్రహారం రెవెన్యూ గ్రామంలో సర్వే నంబర్ 18/3లో తనకు కొంత భూమి ఉందని, అందులో కొంతభాగం ఇల్లు నిర్మించుకున్నానని, ఆ పక్కనే తన సంబంధించిన భూమి ఉందన్నారు. అయితే తన భూమికి నగరి ఉమాశంకర్, నగరి అరుణకు చెందిన స్థలానికి మధ్య చెరువు కాలువ హద్దుగా కలిగి ఉందని తెలిపారు. ఇటీవల వారు ఆ కాలువను పూడ్చివేసి, తన భూమిని ఆక్రమించి ఇల్లు, కాంపౌండ్ గోడను నిర్మిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. చెరువు కాలువ కింద సాగు భూములు చాలా ఉన్నాయని, అధికారులు పరిశీలించి అక్రమ కట్టడాలను నిలిపి వేయాలని, చెరువు కాలువను ఏర్పాటు చేసి న్యాయం చేయాలని ఆయన విన్నవించాడు.

మా మొర ఆలకించండి సారూ..



వినతులు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్: మా మొర ఆలకించి న్యాయం చేయండి సారూ అంటూ పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు వేడుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ, జేసీ విద్యాధరికి పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు వినతులు అందజేశారు.

వృద్ధాప్య పింఛన్ ఇప్పించండి



మాది చిత్తూరు రూరల్ మండలం గాజులపల్లి. నా వయసు 74 ఏళ్లు. ఇప్పటి వరకు వృద్ధాప్య పింఛన్ ఇవ్వడం లేదు. పింఛన్ కోసం చాలాసార్లు మండల అధికారులకు వినతి పత్రం ఇచ్చాను. ఎన్నిసార్లు వినతిపత్రం ఇచ్చినా న్యాయం జరగడం లేదు. ఇప్పుడైనా కరుణించి వృద్ధాప్య పింఛన్ ఇప్పించండి

– నారాయణస్వామినాయుడు, చిత్తూరు రూరల్

షాపు కూల్చి వేసి పొట్టకొట్టారు



చిత్తూరు నగరంలోని హైరోడ్డులో ఉన్న షాపును కూల్చి వేసి మా పొట్టకొట్టారు. గత 40 ఏళ్లుగా ఆ టీ షాపును నమ్ముకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. ఈ నెల 15వ తేదీన నగరపాలక సంస్థ అధికారులు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా హైరోడ్డు విస్తరణ పేరిట షాపును కూల్చేశారు. ఇక తమకు జీవనాధారం ఎవరు కల్పిస్తారు ? కలెక్టర్ సారే మాకు న్యాయం చేయాలి.

– కుటుంబీకులతో హైరోడ్డు బాధితుడు కరీమ్

బంధువులే ఆస్తిని కాజేశారు



మాది పలమనేరు మండలం గొబ్బిళ్ల కోటూరు గ్రామం. నా భర్తకు పూర్వీకుల ఆస్తి 82 సెంట్లు ఉంది. అందులో 22 సెంట్ల భూమిని నా భర్త బంధువులు అక్రమంగా ఆక్రమించుకుని మోసం చేశారు. ఈ సమస్యను మండల అధికారులకు చెప్పినా న్యాయం జరగడం లేదు. కలెక్టర్ దయ చూపి నాకు న్యాయం చేయాలి.

– ఆదిలక్ష్మి, బాధితురాలు, గొబ్బిళ్లకోటూరు, పలమనేరు మండలం

భూమిని ఆక్రమించాడు



మాది పుంగనూరు మేళందొడ్డి గ్రామం. మాగ్రామ రెవెన్యూ దాఖలాలో సర్వే నంబర్లు 663, 111/6లో 3.14 ఎకరాల భూమి నా తండ్రి పేరిట ఉంది. ఆ భూమిని పుంగనూరుకు చెందిన ఓ వ్యక్తి అన్యాయంగా ఆక్రమించుకుని మండల రెవెన్యూ అధికారుల సహాయంతో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నాడు. నా తండ్రి మరణించడం వల్ల ఆ భూమి నాకే చెందాల్సి ఉంది. అధికారులు పరిశీలించి న్యాయం చేయాలి.

– బాధితుడు హరినాథ్, పుంగనూరు మండలం



ఈఆర్వో బిల్లింగ్ కేంద్రం వద్ద క్యూలో ఉన్న వినియోగదారులు

కిటకిటలాడిన ఈఆర్వో

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్‌శాఖ చిత్తూరు అర్బన్ కార్యాలయ ఈఆర్వో (ఎలక్ట్రిసిటీ రెవెన్యూ కార్యాలయం) వినియోగదారులతో కిటకిటలాడింది. రెండో శనివారం, ఆదివారం వరుసగా రెండు రోజులు సెలవు రావడంతో సోమవారం అధిక సంఖ్యలో వినియోగదారులు కరెంటు బిల్లు చెల్లించడానికి బారులు తీరారు. కరెంటు బిల్లులు జరిమానా లేకుండా చెల్లించడానికి గడువు దగ్గర పడుతోంది. వినియోగదారులు ఈఆర్వో బిల్లింగ్ కేంద్రం వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలో కనిపించారు. డివిజన్ కార్యాలయం వినియోగదారుల వాహనాలతో నిండిపోయింది.

భక్తి శ్రద్ధలతో రాహుకేతు పూజలు



బంగారుపాళెం: మొగిలిలో రాహుకేతు పూజల్లో పాల్గొన్న భక్తులు

బంగారుపాళెం: మండలంలోని ప్రముఖ శైవక్షేత్రం మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజలను ఘనంగా నిర్వహించినట్లు ఈఓ మునిరాజులు తెలిపారు. ఈ సందర్భంగా స్వయంభు శ్రీమొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మ మూలవర్లకు ఉదయం ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం రాహుకాల సమయం ఉదయం 7.30 గంటల నుంచి 9 గంటల వరకు రాహు, కేతు, సర్పదోష నివారణ పూజలు చేపట్టారు. పెద్దసంఖ్యలో భక్తులు దోష నివారణ పూజలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.